క్లుప్తంగా

వాహనాలను తీసుకెళ్లండి

సీఐ విజయకుమార్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏళ్ల తరబడి ఉన్న వాహనాలను యజమానులు తీసుకెళ్లాలని పట్టణ సీఐ విజయకుమార్ సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినప్పుడు వాహనాలను తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్‌లో పెట్టామని తెలిపారు. కొన్ని సంవత్సరాల నుంచి దాదాపు 10 ద్విచక్రవాహనాలు పోలీస్ స్టేషన్‌లోనే ఉన్నాయని, యజమానులు వాటిని తీసుకెళ్లాలని సూచించారు. ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకపోవడంతో వాటి యజమానుల వివరాలు తెలియడం లేదన్నారు. వాహనాలు తుప్పుపట్టి పోతున్నాయని, యజమానులు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన పత్రాలను చూపించి వాహనాలను తీసుకెళ్లాలని కోరారు.

శివాజీకి ఆధ్యాత్మిక సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శివాజీ

కేశంపేట: అద్వైత చైతన్య జాగృతి ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన శివాజీకి ఆదివారం ఆధ్యాత్మిక సేవా పురస్కారాన్ని అందించారు. హైదరాబాద్‌లోని హబ్సిగూడలో నిర్వహించిన కార్యక్రమంలో గీత వధాన కళానిధి గీతచార్య యండవల్లి మోహన్‌రావు, సంస్థ చైర్మన్ కూర్ర దుర్గారావులు శివాజీని సన్మానించి ఆధ్యాత్మిక సేవా పురస్కారంతో పాటు ప్రశంస పత్రం అందించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు, పట్టణాల అభివృద్ధి సాధ్యమవుతుందని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పానుగంటి సురేందర్ అన్నారు. ఆదివారం షాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల వెలువడిన యూత్ కాంగ్రెస్ ఫలితాల్లో 289 ఓట్ల మెజార్టీతో మండల అధ్యక్షుడిగా గెలుపొందానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఓటేసి గెలిపించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే తప్పదని, సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తోందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు ఆరు గ్యారంటీల అమలు విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

కళాశాల నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్నేహితుడు హైదరాబాద్‌కు చెందిన సూరి రూ.20లక్షల విరాళాన్ని అందజేశారు. దాదాపు రూ.10కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కళాశాల నిర్మాణానికి ఎమ్మెల్యే కోరిక మేరకు సూరి తనవంతుగా విరాళం అందించారు. సూరి తండ్రి వెంకటసుబ్బయ్య పేరిట రూ.20లక్షలను కళాశాల అభివృద్ధి కమిటీ ఖాతాలో ఆర్టీజీఎస్ ద్వారా జమచేశారు. నిరుపేదల విద్యార్థుల చదువుకు ఎమ్మెల్యే చేస్తున్న నిస్వార్థ సేవ ఎంతో గొప్పదని కొనియాడారు. భావి తరాలకు గుర్తుండిపోయే ఈ కళాశాల నిర్మాణంలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. అడిగి వెంటనే సూరి ముందుకొచ్చి ఇంత పెద్ద విరాళాన్ని అందించడం హర్షణీయమని ఎమ్మెల్యే అభినందించారు.

బస్ సర్వీసును పునరుద్ధరించాలి

మంచాల: కరోనా కారణంగా నిలిపివేసిన ఆర్టీసీ బస్సులను యాథావిధిగా తిప్పాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. తిప్పాయిగూడ-ముకునూర్ రోడ్డును మరమ్మతు చేయాలని కోరారు. ఆదివారం నాయకులు తిప్పాయిగూడలో ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గోరంకల నర్సింహ మాట్లాడుతూ.. రెండేళ్లుగా ఇబ్రహీంపట్నం నుంచి చౌటుప్పల్ (వయా ఆరుట్ల, తిప్పాయిగూడ) ఆర్టీసీ బస్సు రావడం లేదని తెలిపారు. రవాణా సౌకర్యం లేకపోవడంతో తిప్పాయిగూడ, చిత్తాపూర్, ఆరుట్ల, తాళ్లపల్లిగూడ, ముకునూర్ నుంచి చౌటుప్పల్‌కు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. ఇంతకు ముందు లాగే మధ్యాహ్నం 2 గంటలకు ఇబ్రహీంపట్నం వయా ఆరుట్ల, తిప్పాయగూడ మీదుగా చౌటుప్పల్, తిరిగి ఉదయం 10 గంటలకు ఆయా గ్రామాల మీదుగా చౌటుప్పల్ నుంచి ఇబ్రహీంపట్నం వచ్చే విధంగా బస్సును తిప్పాలని కోరారు. ఇదే విషయంపై పట్నం ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేశామని, అయినా స్పందన లేదని ఆరోపించారు. అందుకే సంతకాల సేకరణ చేసి, అధికారులను సంప్రదిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు యాదయ్య, నాయకులు సుధాకర్, ఐలయ్య, కృష్ణ, ప్రశాంత్, అనిత పాల్గొన్నారు.

‘ఈసీ’పై బ్రిడ్జి నిర్మించేదెప్పుడో?

నిధులు మంజూరైనా పనులు ప్రారంభించని అధికారులు

- శంకుస్థాపనకే పరిమితం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, రైతులు



నక్కలపల్లి నుంచి హైతాబాద్ వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న ప్రజలు

మొయినాబాద్‌రూరల్: ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు సమావేశాల్లో ఉపన్యాసాలు ఇస్తున్నారే కానీ పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మొయినాబాద్, షాబాద్ మండలాల్లోని పలు గ్రామాలను కలిపే మధ్యలో ఉన్న ఈసీ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.5కోట్ల నిధులు విడుదలయ్యాయి. గతంలో అధికారులు పనులు ప్రారంభించి రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో పనులు కార్యరూపం దాల్చడం లేదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. పనులు ముందుకు సాగక శిలాఫలకానికే పరిమితమైందని ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామ సమీపంలో గల ఈసీ వాగుపై వంతెన లేకపోవడంతో చుట్టుపక్క గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో షాబాద్ మండలం సర్దార్‌నగర్‌లో అంగడి, షాద్‌నగర్‌కు వెళ్లే ప్రజలు చేవెళ్ల నుంచి తిరిగిపోవాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు. నక్కలపల్లి నుంచి హైతాబాద్ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరం. వర్షాకాలం వాగు వస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొంటున్నారు. నక్కలపల్లి ఈసీ వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే తోల్‌కట్ట, ఎత్‌మార్‌పల్లి, నక్కలపల్లి, చాకలిగూడ, కేతిరెడ్డిపల్లి, కనకమామిడి గ్రామాలతో పాటు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు నక్కలపల్లి నుంచి షాబాద్‌కు వెళ్లేందుకు దగ్గర అవుతుంది. ఈ బ్రిడ్జి పనులు త్వరగా ప్రారంభించి వచ్చే వర్షాకాలం వరకు పూర్తి చేయాలని నక్కలపల్లి, ఎత్‌మార్‌పల్లి, తోల్‌కట్ట, కేతిరెడ్డిపల్లి గ్రామాలతో పాటు చుట్టు పక్క గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వంతెన కోసం వేసిన శిలాఫలకం

రూ.5కోట్లు మంజూరు

మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఈసీ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి సీఆర్ఆర్ అంచనా రూ.5కోట్ల నిధులు మంజూరయ్యాయి. రెండు సంవత్సరాల క్రితం 2023 ఏప్రిల్ 16వ తేదీన అప్పటి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్థానిక ఎమ్మెల్యేతో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. కానీ ఈ బ్రిడ్జి నిర్మాణానికి దాదాపు రెండు సంవత్సరాలు అవుతున్నా పనులు మాత్రం ఎక్కడ ఏమి ప్రారంభించలేదు. దీంతో శిలాఫలకానికే బ్రిడ్జి నిర్మాణ పనులు పరిమితమయ్యాయి.

గ్రామస్తులకు ఎంతో ఉపయోగం



నక్కలపల్లి సమీపంలో గల ఈసీ వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే నక్కలపల్లితో పాటు చుట్టు పక్క మండలాల్లోని గ్రామాల ప్రజల రాకపోకలకు ఎంతో ఉపయోగపడుతోంది. షాబాద్ మండలం సర్దార్‌నగర్, షాద్‌నగర్ వెళ్లాలంటే చేవెళ్ల నుంచి తిరిగి వెళ్తున్నాం. దీనిపై ఆలోచించి గత ప్రభుత్వంలో నిధులు మంజూరు చేశారు. కానీ పనులు చేయడంలో నిర్లక్ష్యం వహించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించి మంజూరైన నిధులతో పనులను ప్రారంభించి వచ్చే వర్షాకాలం నాటికి పూర్తిచేయాలి. ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

–స్వప్న, మాజీ సర్పంచ్, నక్కలపల్లి

త్వరలో పనులు ప్రారంభం



నక్కలపల్లి సమీపంలో ఉన్న ఈసీ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి 2 సంవత్సరాల క్రితం సీఆర్ఆర్ నిధులు రూ.5 కోట్లు మంజూరయ్యాయి. ఈ వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం కృషి చేసింది. 2023 ఏప్రిల్ 16వ తేదీన పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి కాంట్రాక్టర్ పనులు నిర్మిస్తామని ముందుకొచ్చారు. కానీ ఆ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించడంతో ఈ పనులను మరో కాంట్రాక్టర్‌కు అప్పగించాం. వెంటనే పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తున్నాం.

–విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ, మొయినాబాద్

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

కొందుర్గు: కొందుర్గుకు ప్రత్యేక మార్కెట్ కమిటీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వివరించడం, ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించడంపై షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలం వ్యవసాయ రంగంలో ముందుందని, ఈ ప్రాంత ప్రజలు వ్యవసాయాన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారని వివరించి మంత్రిని ఒప్పించిన ఎమ్మెల్యేకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఏడాది కాలంలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్, మినీస్టేడియం ఏర్పాటు చేయాలనే సంకల్పమే ఎమ్మెల్యేకు కొందుర్గు మండలంపై ఉన్న ప్రేమాభిమానాలు చెప్పొచ్చని గుర్తుచేశారు. ఆయనకు మండల ప్రజలు ఎప్పుడు రుణపడి ఉంటారన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



నూతన సభ్యులకు నియామకపత్రం అందిస్తున్న మండల నాయకులు

కొందుర్గు: మండలంలోని శ్రీరంగాపూర్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల కమిటీ అధ్యక్షుడు ఆనంద్ ఆధ్వర్యంలో కమిటీని ప్రకటించి నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా యాదగిరి, అధికార ప్రతినిధిగా అశోక్, ఉపాధ్యక్షుడిగా గణేశ్, ప్రధాన కార్యదర్శిగా యాదయ్య, కార్యదర్శులుగా శేఖర్, రమేశ్, కోశాధికారిగా నరేశ్, ప్రచార కార్యదర్శిగా రవీందర్, కృష్ణయ్య ఎన్నికైనట్లు ఆనంద్ పేర్కొన్నారు.

ఉన్నత విద్యకు స్కాలర్‌షిప్‌లు

ఎన్‌టీఆర్ విద్యాసంస్థల డీన్ డాక్టర్ ఎంవీ రామారావు



రాత పరీక్షకు హాజరైన విద్యార్థినులు

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంటర్ మీడియట్ మొదటి, రెండో సంవత్సరానికి స్కాలర్‌షిప్ అందించేందుకు రాత పరీక్ష నిర్వహిస్తున్నామని ఎన్‌టీఆర్ విద్యాసంస్థల డీన్ డాక్టర్ ఎంవీ రామారావు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో గల గండిపేట ఎన్‌టీఆర్ కుటీరంలో విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించారు. ఈ రాత పరీక్షలో దాదాపు 1500ల మందికిపైగా విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ డీన్ మాట్లాడుతూ.. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు నిర్వహించామని తెలిపారు. అదేవిధంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇది అనేక సంవత్సరాల నుంచి కొనసాగుతోందని తెలిపారు. త్వరలోనే విద్యార్థుల ఫలితాలు ప్రకటించి వచ్చే విద్యా సంవత్సరం 2025 గాను స్కాలర్‌షిప్‌లు మెరిట్‌ను బట్టి అందిస్తామని పేర్కొన్నారు.

శిక్షణ శిబిరంలో యోగా గురువులు



యోగ సాధన చేస్తున్న గురువులు

షాద్‌నగర్‌రూరల్: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో నిర్వహించిన యోగా శిక్షణ శిబిరంలో పతంజలి యోగా సమితి వ్యవస్థాపకుడు పానుగంటి శశిధర్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పలువురు యోగా గురువులు పాల్గొన్నారు. వారంరోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణ శిబిరంలో యోగాగురువులు యోగాసనాలను సాధన చేసినట్లు ఆదివారం పానుగంటి శశిధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ యోగాపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ప్రతిరోజు యోగ సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యోగ సాధన చేయాలని సూచించారు. యోగాతో మానసికోల్లాసం కలగడంతో పాటు శారీరకంగా మన ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. హరిద్వార్ వెళ్లిన వారిలో రాంచంద్రయ్య, రామయ్య, లింగమయ్య, గవయ్య, కుమారస్వామి, అశోక్‌కుమార్, శివకుమార్, విజయకుమార్ ఉన్నారు.

మండల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం చౌదరిగూడలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అభివృద్ధిని కాగితాలకే పరిమితం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు పీహెచ్‌సీని మంజూరు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోనే కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మండలాలుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు రాజు, కొందుర్గు మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

12 నుంచి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధి రాంపూర్‌లో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 12 నుంచి 17 వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ జిల్లెల పవన్ కుమార్ రెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అమృత, ఆలయ కమిటీ డైరెక్టర్లు సామి గౌడ్, జంగయ్య, ఆలయ పూజారి నరసింహ చారి, మాజీ సర్పంచ్ శ్యామ్ సుందర్‌రెడ్డి, కృష్ణా రెడ్డి, శ్రావణ్ కుమార్ రెడ్డి, మాధవచారి, మల్లేశ్, వెంకటేశ్, శివ, షర్పుద్దీన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ ఉపాధ్యక్షుడికి సన్మానం

కడ్తాల్: లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్‌ను బీఆర్ఎస్ నాయకులు ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విజితారెడ్డి, పార్టీ అన్మాస్‌పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు మహేశ్, నాయకులు శ్రీను, ప్రశాంత్, భాస్కర్, మల్లేశ్, ప్రేమ్, రమేశ్, రవి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

‘రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన’



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అబద్ధాలు, మోసాలతో పాలన కొనసాగిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కండె హరిప్రసాద్ ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ‘ఆరు అబద్ధాలు-అరవై ఆరు మోసాల’ పేరిట బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం కల్వకుర్తిలో నిర్వహించిన బైక్ ర్యాలీ సందర్భంగా పట్టణంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, పార్టీ నాయకులతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం హరిప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు లక్ష్మణ్, నర్సింహ, కృష్ణనాయక్, చెన్నకేశవులు, పార్టీ నాయకులు గోరటి శ్రీను, శ్రీను, గిరియాదవ్, కృష్ణయాదవ్, నరేందర్ తదితరులు ఉన్నారు.

పీసీసీ అధ్యక్షుడికి సన్మానం



పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల యూత్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన నాయకులు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అందె మోహన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పీసీసీ అధ్యక్షుడు దిశానిర్దేశం చేశారన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులు ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు సేవకులుగా పని చేయాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకులకు పార్టీలో తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీకి యువ నాయకుల అవసరం ఎంతైనా ఉందని, యువతకు పార్టీ ప్రాధాన్యతనిస్తుందన్నారు. సబ్బండ వర్గాల ప్రజలకు సమన్యాయం అందించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిప్పళ్ల శ్రీనాథ్, అసెంబ్లీ అధ్యక్షుడు పులిమామిడి రాజేశ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు సాయివంశీ, నాయకులు వంశీగౌడ్, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, నవీన్, అజయ్, రాహుల్, ప్రవీణ్‌కుమార్, లడ్డూ, సాయి, శ్రీను, వేణు, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మొయినాబాద్: 31 సంవత్సరాల క్రితం ఒకే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు మళ్లీ ఒక్కచోట చేరి చదువుకునే రోజుల్లోని తీపి జ్ఞాపకాలు, మధుర స్మృతులను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. మండల పరిధిలోని కనకమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992–93లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ ఫాంహౌస్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల రోజులను గుర్తుచేసుకొని అప్పటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బాలుడికి పరామర్శ



విద్యార్థిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పాఠశాల బస్సు అదుపుతప్పిన ఘటనలో గాయపడిన విద్యార్థి నందీశ్వర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆస్పత్రికి చేరుకొని బాలుడిని పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందని విద్యార్థిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాలుడు త్వరగా కోలుకునే విధంగా మెరుగైన వైద్యసేవలను అందించాలన్నారు. పాఠశాల యాజమాన్యంతో మాట్లాడతానని, మీకు ఏమైనా ఇబ్బంది కలిగితే సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్ బాబర్, డైరెక్టర్ కరుణాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు ఇబ్రహీం, బాల్‌రాజ్‌గౌడ్, గోపాల్ తదితరులు ఉన్నారు.